క్లుప్తంగా

అధ్వాన రోడ్డుతో అవస్థలు



దుప్పాడ రోడ్డుపై ఏర్పడిన గోతులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న దుప్పాడ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరం



యువతకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ కోరాడ రామారావు

విజయనగరం క్రైమ్: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపారు. ఫూల్‌బాగ్ కాలనీలోని యువతతో సోమవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా చట్టపరంగా శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో టూటౌన్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



చెరువుగా మారిన సాలివీధి రోడ్డు

విజయనగరం అర్బన్: విజయనగరం మండలం గుంకలాం గ్రామంలో ప్రధాన వీధులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లు అధ్వానంగా మారడంతో వర్షపు నీరు నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జేసీ కె. కార్తీక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.పెంటంనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ డీఐజీ విజయలక్ష్మి

భోగాపురం: మండలం కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ డీఐజీ విజయలక్ష్మి సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కొరకు కార్యాలయానికి వచ్చే వారి దస్త్రాలను పరిశీలించి సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని, అదేవిధంగా ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కె. రోహణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాట భజన బృందాన్ని ఆశీర్వదిస్తున్న ఆలయ వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి చదురుగుడి ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనకాపల్లి పరవాడపాలెం, వెంకన్న గ్రామానికి చెందిన శ్రీ వెంకన్న పైడిమాంబ కోలాట బృందం సుమారు రెండున్నర గంటల పాటు కోలాటం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీలు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, గత ఏడాదికి, ప్రస్తుతం కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల సంఖ్య పెరిగిందీ లేనిదీ తెలుసుకున్నారు. పిల్లల అభ్యసనస్థాయిని పరీక్షించడంతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ ఎం.భారతి, ఫిజియోథెరపిస్ట్ మనోజ్ కుమార్, ఐఈఆర్టీలు శ్రీనివాసరావు,సత్యనారాయణ ఉన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



పూసపాటిరేగ : విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ప్రజాప్రతినిధులు



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాం ఉన్నత పాఠశాల ఆవరణలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నెల్లిమర్ల రూరల్: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. కొండగుంపాం ఉన్నత పాఠశాలలో వివిధ రకాల స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు, అరటిపండ్లతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, హెచ్‌ఎం వేణుగోపాల్, గ్రామ పెద్దలు శంకరరావు, లక్ష్మణరావు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రెల్లివలసలో..

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసారు. సర్పంచ్ ఇజ్జురోతు అప్పలరాజు, వెంపడాపు సూర్యనారాయణ సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాట్నూరు సురేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు ఇజ్జురోతు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

- సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సత్యా విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో సత్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాల వల్ల రక్తకొరతను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎం. రాము, డి. గౌరీశంకర్, ఎం.సత్యనారాయణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

విజయనగరం ఫూల్‌బాగ్: మహారాజపేటలో ఉన్న గిరిజన మహిళా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ.. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ప్రత్యామ్నాయ భవనం ఉన్నప్పటికీ అందులోకి మార్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సుమారు 250 మంది విద్యార్థినులు ఉన్నారని, వీరందరికీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సమయంలో అక్కడికు చేరుకున్న గిరిజన సంక్షేమ అధికారి రామానందం హాస్టల్ విద్యార్థులతో సమావేశమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించని ఎడల వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, చిన్నబాబు, రాజు, రమేష్, సుస్మిత, దుర్గాప్రసాద్, రామకృష్ణ, ఆద్య, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఎండీఎం అమలు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం (మిడ్ డే మీల్స్) అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం మాట్లాడుతూ.. వేలాది మంది విద్యార్థులకు ఆకలి తీర్చే మధ్యాహ్నం భోజన పథకం నిలిపివేయడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజనం కల్పించడంతో పాటు మరుగుదొడ్లు, బాత్రూమ్‌లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, పట్టణ కార్యదర్శి ఎ.సుమన్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు



ముగింపు సభలో అతిథులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి, తదితరులు

డెంకాడ: జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సెలోనిస్ ప్రాసెస్ మైనింగ్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారంతో ముగిసింది. ఎడ్యు–స్కిల్స్ అసోసియేట్ ఫర్ లెర్నింగ్ డవలప్‌మెంట్ మేనేజర్ ఎస్‌వీ పవన్‌కుమార్ మార్కెట్లలో డేటా విజువలైజేషన్, ప్రాసెస్ మైనింగ్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పవన్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, లెండి ఇనిస్టిట్యూట్ పాలకమండలి సభ్యుడు కె.సురేష్, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్ బాబు, విభాగాధిపతి ఎ.రామారావు, కో ఆర్డినేటర్లు ఇ.మధుబాబు, ఏవీడీఎస్ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న వైరల్ జ్వరాలు

- నిరుపయోగంగా మలేరియా సబ్ యూనిట్
- దోమల నివారణకు కానరాని చర్యలు
- గంబూషియా చేపల సరఫరా నిల్

చీపురుపల్లి: మండలంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. అటు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైరల్ జ్వరాలతో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ వస్తోంది. చీపురుపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో గల ల్యాబ్‌లో సోమవారం జ్వరంతో బాధపడుతూ వచ్చిన 30 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి టైఫాయిడ్ పాజిటివ్ వచ్చినట్లు సిబ్బంది నిర్ధారించారు. సీహెచ్‌సీలో ఒకరోజు నిర్వహించిన పరీక్షల్లోనే ఇంత మందికి టైఫాయిడ్ జ్వరాలని నిర్ధారణ అయితే...ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇంకెంత టైఫాయిడ్, మలేరియా కేసులు నమోదవుతున్నాయో మరి. అధిక ఉష్ణోగ్రత, చలి జ్వరం, ఒల్లు నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వీరికి వైద్యులు వైరల్ జ్వరం అంటూ ఐదు రోజులకు సరిపడా మందులు రాసి ఇస్తున్నారు. వైరల్ జ్వరాల వ్యాప్తి నివారణకు సంబంధిత శాఖల అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి కేంద్రంగా మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ఇక్కడే ఉన్నప్పటికీ వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో యంత్రాంగం విఫలమయ్యిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, పట్టణాల్లో సైతం ఎక్కడికక్కడే నీరు నిలిచిపోవడం, కాలువలు వీధుల్లో పారడం జరుగుతోంది. దీంతో దోమలు సంఖ్య పెరిగిపోయింది. దోమల నివారణ కోసం మలేరియా సబ్ యూనిట్ అధికారులు గంబూషియా చేపలు చెరువుల్లో విడిచిపెట్టడం, కాలవలు శుభ్రం చేయించడం, వీధుల్లో మలాథియన్ స్ప్రే చేయించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలోనే అలాంటి చర్యలు ఇంతవరకు కానరాలేదంటే ఇక గ్రామాల్లో సంగతి చెప్పాల్సిన పని లేదు. అసలు మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ఎక్కడుందో, అందులో అధికారు లు ఎవరో కూడా స్థానికులకు తెలియని దుస్థితి నెలకొంది. పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు అధికారులను అప్రమత్తం చేసేందుకు పాలకవర్గం నేతలు సైతం దృష్టి సారించడం లేదు. దీంతో అధికారులు కూడా కనీసం పట్టించుకునే పాపాన పోవడం లేదు. ఇదే విషయమై మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు సాక్షి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన మొబైల్ స్విచ్ ఆఫ్ అని సమాధానం ఇచ్చింది.

ప్రహరీ కూల్చివేయడం దారుణం

నెల్లిమర్ల: రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇంటి ప్రహరీని కూల్చివేయడం దారుణమని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దన్నానపేటలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇల్లు ప్రభుత్వ స్థలంలో ఉందని చెబుతూ, అధికారులు ప్రహరీ కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మండలం, నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలను కొంతమంది అక్రమార్కులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్న విషయం అధికారులకు తెలియదా అని మండిపడ్డారు. నెల్లిమర్ల, జరజాపుపేట కొంతలవాని చెరువుల్లో గుడుల పేరిట అక్రమ నిర్మాణాలు చేపట్టరన్నారు. అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ మాజీ సర్పంచ్ దంగా భోలోక ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి త్రినాథరావు, దారపు లక్ష్మణరెడ్డితో పాటు పలువురు తహసీల్దార్‌కు టి. గోవింద, కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో గల సర్వే నంబర్ 44–2లో ప్రభుత్వభూమిని దంగా భూలోక ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు కొబ్బరితోట వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బొడ్డుగురయ్యపేటలో సర్వే నంబర్ 299లో రిజర్వ్ ఫారెస్టు స్థలాన్ని ఆక్రమించినట్లు తెలిపారు. అలాగే అదే గ్రామంలోని సర్వే నంబర్ 105లో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమంచి కంచె వేశారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆక్రమణలకు పాల్పడిన మాజీ సర్పంచ్, ఆయన బంధువులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

నెల్లిమర్ల: సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు.

ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న అప్పారావు

దత్తిరాజేరు: వలసల నివారణ కోసం ఉపాధి హామీ పథకం పనిదినాలను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పురం అప్పారావు ఎంపీడీఓను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు రెండు నెలలుగా ఉపాధి వేత నాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనాలు అందేలా చూడాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సి పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని విద్యా ర్థులకు సూచించారు.అధ్యాపకుల కృషి ఫలితంగా గతేడాది ఇంటర్‌లో తమ కళాశాల విద్యార్థులు 98శాతం ఉత్తీర్ణత సాధించడంతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచామన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈఏడాది కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఈనెల 31వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, ఆసక్తి ఉన్న పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో చేరాలని కోరారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ముందుగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయడు అన్నారు. ఈ మేరకు జిల్లా మలేరియా నివారణ అధికారి మణి, కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తితో కలిసి సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య కార్యదర్శులు, ఏఎస్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. దోమలు వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి నివారించాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది కిలోల గంజాయితో మహిళ అరెస్ట్

- రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముడిదాం గ్రామం వద్ద ఒక మహిళను రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి పది కిలోల గంజాయి, రూ. 4,820 నగదు సీజ్ చేసినట్లు రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ శివారులో వాహనతనిఖీలు చేపడుతుండగా.. ఒడిశా రాష్ట్రం నౌపడ జిల్లా సినపల్లి మండలానికి చెందిన లిలినాయక్ పట్టుబడింది. ఆమె నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై వాసుదేవ్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: మండల పరిషత్ సమావేశ మందిరంలో సీడీపీఓ ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణ చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌సీసీ (లోకల్ కంప్లైంట్ కమిటీ) నోడల్ అధికారి, తహసీల్దార్ ఎం. సురేష్, ఐసీసీ (ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ) చైర్‌పర్సన్, ఎంపీడీఓ చంద్రకళ వేధింపుల నివారణ చట్టం–2013పై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్, ఎంఈఓ రమణమూర్తి, ఏఓ హరికృష్ణ, ఏసీడీపీఓ తవిటినాయుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థాన్ని అభివృద్ధి చేస్తాం..

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



రామకోనేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: రెండో భద్రాద్రిగా పేరొందిన రామతీర్థం దేవస్థానాన్ని మంచి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. రామతీర్థంలో సోమవారం ఆమె పర్యటించి ఉత్తర రాజగోపురం వద్ద జరుగుతున్న గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామతీర్థం అభివృద్ధికి అంతా సహకరించాలన్నారు. ఆక్రమణదారులను నొప్పించకుండా అందరి సూచనలు, సలహాలతో వాళ్లకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేద్దామన్నారు. ఆలయ భూములు రామయ్యకే చెందుతాయని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక వర్తకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, గురాన అసిరినాయుడు, కడగల ఆనంద్‌కుమార్, తిరుపతిరావు, సత్యనారాయణ, పైడిరాజు, అట్టాడ శ్రీధర్, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

13 వినతుల స్వీకరణ



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 13 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతిపత్రాలను కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, సంబంధిత అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, శానిటేషన్‌కు సంబంధించి 2, రెవెన్యూకు సంబంధించి 2, హౌసింగ్ 1, ఇతర సమస్యపై ఒకటి చొప్పున వినతులు అందాయి. ప్రజలు తెలియజేసిన వినతులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని కమిషనర్ మల్లయ్యనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.